క్లుప్తంగా

కల్యాణం .. కమనీయం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామి చెంత విశేష పూజలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఈఎస్‌ఐ ఏర్పాటు చేయాలని వినతి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో కార్మికుల సౌకర్యార్థం ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఆర్వో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, చిన్న పరిశ్రమల్లో సుమారు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి వైద్య సేవలు అందించడానికి వీలుగా ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రారంభించాలని గనిశెట్టి కోరారు.

రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో ల్యాండ్ పూలింగ్ కోసం భూములు ఇచ్చిన తమకు న్యాయం చేయాలని ఎస్సీ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ల్యాండ్ పూలింగ్ స్థలంలో నిరసన తెలిపి వంటావార్పు చేపట్టారు. తమకు డీ పట్టాలు ఇచ్చిన భూములను ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ కోసం సేకరించిందన్నారు. రైతులకు ఇస్తామన్న ప్లాట్లు ఇంత వరకూ ఇవ్వక పోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందని రైతులు చెప్పారు. తమకు న్యాయం చేయకుండా జగనన్న కాలనీ నిర్మాణం చేపట్టడానికి వీల్లేదని రైతులు పట్టుపడుతున్నారు.

నైతిక విలువలతో రాణింపు

ఏయూ క్యాంపస్: నైతికత, విలువలు విద్యార్థి దశ నుంచి మనలో భాగం కావాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా యోగా విద్యకు ప్రాముఖ్యత, ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం మానవ జీవితంపై ఎంతో ప్రభావం చూపుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంఏ యోగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అంగరంగ వైభవంగా రామచంద్రమ్మ పండగ

- అమ్మదర్శనానికి బారులు తీరిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్యేక అలంకరణలో రామచంద్రమ్మ అమ్మవారు



శ్రీరామచంద్రమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సతకం పట్టు వద్ద రథోత్సవంలో ఊరేగుతున్న అమ్మవారి ఘటాలు

పరవాడ: వాడచీపురుపల్లి లో కొలువుదీరిన రామచంద్రమ్మ పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 14 గ్రామాల ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్యూలో ఉన్న వారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందించారు.

ఉట్టిపడిన ఆధ్యాత్మికత

అమ్మవారి పండగ నేపథ్యంలో 14 గ్రామాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. విద్యుత్ కాంతులతో మెరిసి పోయాయి. డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, బాజా భజంత్రీలు, నేల డ్యాన్సులతో రథోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించి పరవశించిపోయారు. అమ్మవారి ఘటాలను సతకంపట్టు నుంచి ఆలయం వరకు ఊరేగించారు. వేలాది మంది భక్తుల సమక్షంలో భారీ బాణ సంచాకాల్పుల మధ్య మంగళవారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని కనుల పండవగా ఉత్సవ కమిటీ నిర్వహించింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పండగలో భాగంగా మంగళవారం రాత్రి వాడచీపురుపల్లి గ్రామంలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెద్దివారి వీధిలో ఏర్పాటు చేసిన పల్సర్ బైక్ ఝూన్సీ వంటి కార్యక్రమాలు యువతను ఉర్రూతలూగించాయి. మిగిలిన గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

రామచంద్రమ్మ వారిని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, సిరిపురపు అప్పలనాయుడు, పెద్దిశెట్టి పూజాశేఖర్, వైఎస్సార్ సీపీ బండి ముత్యాలు, కూండ్రపు తాతాజీ, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య దర్శించుకున్నారు. షటిల్ కాక్ పోటీల విజేతలకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ బహుమతులు అందజేశారు. ఆలయ ధర్మకర్త ఎస్.వి.శ్రీనివాస్, పార్టీ నాయకులు కె.తాతాజీ, పైల అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు తదితరులు ఉన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రశాంతంగా జాతర

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. ఎస్‌ఐలు తేజేశ్వరరావు, మల్లేశ్వరరావుతో పాటు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. పండగ ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, పోలీసు అధికారులకు ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ధన్యవాదాలు తెలిపారు.

స్కే పోటీల విజేతకు అభినందన



జ్ఞానేంద్రను అభినందిస్తున్న ఎంఈవో అప్పలరాజు తదితరులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న యు. జ్ఞానేంద్ర నేపాల్ రాజధాని కట్మాండ్‌లో జరిగిన 7వ స్కే దక్షిణాసియా చాంపియన్ షిప్–2023లో పాల్గొని సిల్వర్ పతకం సాధించినట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి తెలిపారు.

ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఘనత సాధించిన విద్యార్థి జ్ఞానేంద్రను ఎంఈవో అప్పలరాజు, పీడీ రెహమాన్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ స్కే అనేది కశ్మీరీ సాంప్రదాయ క్రీడ(యుద్ధ కళ)అని తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన ఈ స్కే వల్ల శారీరక వ్యాయామంతో పాటు మానసిక వికాసానికి,స్వీయ రక్షణకు ఉపయోగపడుతుందని చెప్పారు.జ్ఞానేంద్ర అండర్–11 విభాగంలో విజేతగా నిలిచాడని,ప్రపంచ చాంపియన్‌గా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

‘సెల్ఫ్’ విద్యార్థులకు ఎంతో హెల్ప్

- నంగినారపాడు జెడ్పీ హైస్కూల్ సందర్శనలో కలెక్టర్
- ప్రోగ్రాం రూపొందించిన టీచర్లకు కలెక్టర్ అభినందన



సెల్ఫ్ ప్రోగ్రాంను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వివరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఉపాధ్యాయులు రూపొందించిన ఆన్‌లైన్ ప్రోగ్రాం సెల్ఫ్ ఎవాల్యుయేషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్(సెల్ఫ్) ఎంతగానో ఉపయోగపడుతుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. సెల్ఫ్ ప్రోగ్రాంను రూపొందించిన పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, ఎస్.సోమేశ్వరరావులను అభినందించారు. విద్యార్థులను స్వీయ అభ్యాసం–స్వీయ మూల్యాంకనం వైపు ప్రోత్సహించే విధంగా సెల్ఫ్ ప్రోగ్రాం రూపొందించినట్టు కలెక్టర్‌కు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు తమకు అర్థం కాని అంశాలను, సందేహాలను ఆన్‌లైన్‌లోనే నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఇది ఆన్‌లైన్ సాధనం కావడంతో ఎప్పుడైనా, ఎక్కడైనా ఉపయోగించుకోవచ్చన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పలు అంశాలను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు ప్రత్యేక సరళిని రూపొందించడం అభినందనీయమన్నారు. వరుసగా అడిగే ప్రశ్నలకు ముందు జవాబులు చెప్పిన తర్వాతే మిగిలిన ప్రశ్నలు వస్తాయని, ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతే దాని గురించి అర్థమయ్యేలా వివరించే వీడియో వచ్చేలా ప్రోగ్రాం సిద్ధం చేశారని అభినందించారు. వీడియో చూసి ఆ ప్రశ్నకు తగిన జవాబు చెప్పిన తర్వాతే ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. దీని వల్ల విద్యార్థి క్లిష్టమైన అంశాలను నేర్చుకోవచ్చని, మరింత విస్తృతంగా సంబంధిత అంశాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ టూల్ ఉపయోగించడానికి ఎలాంటి సాఫ్ట్‌వేర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి అవసరం లేదన్నారు. పీడీఎఫ్ ఫైల్ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో పర్యవేక్షించేందుకు అనువైన డ్యాష్ బోర్డును కూడా రూపొందించారని తెలిపారు. ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసిన ఉపాధ్యాయులను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



ఆర్అండ్‌బీ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

పరవాడ: మండలంలోని పి.బోనంగిలో ఇరు వర్గాల మధ్య కాలువ నిర్మాణ విషయంలో తలెత్తిన వివాదాస్పద స్థలాన్ని రోడ్లు భవనాల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డును ఆనుకుని పంచాయతీ నిధులతో పాలకవర్గం డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. సదరు స్థలం తనదంటూ మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అభ్యంతరం తెలిపారు. దీంతో కాలువ నిర్మాణం నిలిచిపోయింది. కాలువ నిర్మాణం చేపట్టిన స్థలం ఆర్ అండ్‌బీ పరిధిలో ఉందని గ్రామ సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్ వాదిస్తూ సమస్యను రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు రోడ్లు భవనాల శాఖ ఈఈ రమేష్, డీఈ సాగర్, ఏఈ లలిత వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. అధికారుల వెంట పరవాడ జెడ్పీటీసీ పి.సన్యాసిరాజు, సర్పంచ్ కల్పనరాజశేఖర్, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు ఉన్నారు.

ఆదర్శ నాయకుడు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ మధుసూదనరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం దామోదరం సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ మధుసూదనరావు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య అణగారిన వర్గం నుంచి వచ్చినప్పటికీ తన స్వయం కృషితో ఎంతో ఎత్తుకు ఎదిగారన్నారు. తన పట్టుదలతో ఆంధ్రప్రదేశ్ తొలి హరిజన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. కృషి,పట్టుదల ఉంటే ఒక వ్యక్తి ఏ స్థాయికైనా చేరుకోవచ్చేదానికి ఆయన జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు రాజేంద్రప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ దయానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి

సబ్బవరం: అర్హులైన వారికి సకాలంలో రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. సబ్బవరం మండల పరిషత్ సమావేశమందిరంలో మంగళవారం జాయింట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు పలు బ్యాంకుల మేనేజర్లు, అధికారులు కొత్త రుణాల మంజూరు,వసూళ్ల వంటి వాటిపై విస్తృతంగా చర్చించారు. పీడీ లక్ష్మీపతి కొత్త రుణాల మంజూరు,రీ పేమెంట్స్, వ్యవసాయ రుణాలు వంటి వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ ఎస్‌బీఐ మేనేజర్ సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, డీపీఎం కుమారస్వామి,సబ్బవరం,పరవాడ ఏపీఎం సాయిరమేష్, కనకమ్మతో పాటు కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న డైట్ అధ్యాపకురాలు మాధవి

సబ్బవరం: విద్యార్థులంతా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని డైట్ అధ్యాపకురాలు,పరీక్ష పర్వ సమన్వయకర్త జె. మాధవి అన్నారు. సబ్బవరం కేజీబీవీలో పరీక్ష పర్వ 4.0లో భాగంగా విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొన్నారు.పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఏ విధంగా పెంపొందించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో మృదుల, మిగిలిన బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పంటకూ ఈ క్రాప్ తప్పనిసరి

వ్యవసాయ శాఖ డీడీ వెంకటేశ్వర్లు



మల్లునాయుడుపాలెంలో పంటలను పరిశీలిస్తున్న డీడీ వెంకటేశ్వర్లు తదితరులు

సబ్బవరం: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల నుంచి లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదులో నమోదు కావాలని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. వెంకటేశ్వర్లు చెప్పారు. రైతులు వేసిన ప్రతి పంటను వ్యవసాయ సహాయకులు విధిగా ఈ పంటలో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం ఆయన సందర్శించి పంటలను పరిశీలించారు. క్షేత్ర పరిశీలన చేసి,ఈ క్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులను ఆరా తీశారు. ఈ పంటల నమోదు జాబితాల ఆధారంగా రైతులను పిలిచి పంట రకాలు, నీటి సదుపాయం ,రైతుల వివరాలు, సాగుచేస్తున్న పంటల వివరాలు సరిగా నమోదు చేశారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో వ్యవసాయ,ఉద్యాన పంటలు 1100 ఎకరాల్లో సాగుచేస్తున్నట్టు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో అనకాపల్లి డీఏవో బి. మోహనరావు, ఏడీఏలు వసంత కుమారి,రామారావు, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ,రైతులు,గ్రామ పెద్దలు బోను గంగునాయుడు,ఎంపీటీసీ గొర్లి కనకరాజు, ఏఈవో బాలరాజు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే విజయం



733వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నామంటూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసే వరకు కార్మికుల పోరాటం ఆగదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 733వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యూఆర్‌ఎం–1 మరియు 2 విభాగ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్మికులను ద్దేశించి పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, గుమ్మడి నరేంద్ర, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ కులమతాలకు అతీతంగా ఐక్యపోరాటాలు జరుగుతున్నాయన్నారు. పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు పన్నుతోందని, వాటిని ఐక్యంగా తిప్పికొడితేనే విజయం సాధ్యపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, కార్మికులకు అండగా ఉండాలని కోరారు.ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్.రావు, ఎన్. రామారావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, సీహెచ్ సన్యాసిరావు, అప్పారావు, పరంధామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

23న బీహెచ్‌ఈఎల్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

గాజువాక: బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నిక ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి సీహెచ్.ఎస్.త్రినాథరావు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి ఈ నెల 15న నామినేషన్లను స్వీకరిస్తారు. 16వ తేదీన నామినేషన్ల పరిశీలన నిర్వహిస్తారు. 17న నామినేషన్ల ఉపసంహరణలు ఉంటాయి. 23న ఎన్నికలు పూర్తయిన అనంతరం అదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు.

ఎనిమిది మంది డైరెక్టర్ల ఎన్నిక

ఈ ఎన్నికల్లో 472 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకుంటారు. వారు మొత్తం ఎనిమిది మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. గెలిచిన పాలకవర్గం సొసైటీ అధ్యక్ష కార్యదర్శులను, ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. కోశాధికారిని యాజమాన్యం నియమిస్తుంది. బీహెచ్‌ఈఎల్‌లో ఇప్పటికే కో ఆపరేటివ్ ఎన్నికల సందడి నెలకొంది.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగులకు పతకాలు



పతకాలు సాధించిన ఉక్కు ఉద్యోగులు

అగనంపూడి: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగులు సత్తా చాటారు. రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, పోల్ వాల్ట్‌లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న అగనంపూడి పెదమడక కాలనీకి చెందిన విందుల శ్రీనివాసరావు, మర్రిపాలేనికి చెందిన దుల్ల గోపీ, కణితి కాలనీకి చెందిన శిరపనశెట్టి మోహన్ ఉన్నారు. వారిలో విందుల శ్రీనివాసరావు 10 కిలోమీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగులో రజత పతకం కైవసం చేసుకున్నారు. దుల్ల గోపీ షాట్‌పుట్‌లో రజత పతకం, డిస్కస్ త్రోలో సిల్వర్ మెడల్, పోల్ వాల్ట్‌లో కాంస్య పతకం సాధించారు. శిలపరశెట్టి మోహన్ 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెంలో మూడు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలను అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆరిలోవ: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాలు వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 5న జాతీయ రహదారిపై జూ పార్కు సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలుపాలైన ఆయనను ఆరిలోవ పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఈ నెల 12న రాత్రి మృతి చెందాడు. అప్పటి నుంచి అతని మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఆయన బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు. చికిత్స పొందుతున్న సమయంలో ఆయన పేరు గురుమూర్తి సాహు అని చెప్పినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి అడ్రస్ మాత్రం చెప్పలేకపోయాడన్నారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు.

19న కళా తపస్వి 93వ జయంతి వేడుకలు

మద్దిలపాలెం: కళా తపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న సాయంత్రం 5 గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నామని సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. సీనియర్ దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం స్వాతి ముత్యం చిత్రాన్ని ప్రదర్శిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94415 71581 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

చోరీ కేసు ఛేదన



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–2లో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 3న తన ఇంట్లో దొంగతనం జరిగిందంటూ ఉప్పలపాటి అప్పల రాజేశ్వరి(60) ఎంవీపీ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఎంవీపీ క్రైమ్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. రాజేశ్వరి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఎదురుపాకల నారాయణప్పడు(35) ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం వెంకోజీపాలెం కూడలి వద్ద నిందితుడి పోలీసులు అదుపులోకి తీసుకుని, 50.33 గ్రాముల బంగారు గాజులు, 31 గ్రాముల బంగారు గొలుసు, 2 జతల చెవిదిద్దులు, నల్లపూసల గొలుసు.. మొత్తం 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను క్రైం డీసీపీ గంధం నాగన్న మంగళవారం మీడియాకు తెలియజేశారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంతో పాటు చోరీ సొత్తు రికవరీ చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.